www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 30 ఆగస్టు 2024
5
డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ



# ఆర్‌బిఐ క్విజ్ పోటీల్లో పాల్గొనాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-అమలాపురం

ఔత్సాహిక అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులంతా ఆర్బిఐ నిర్వహిస్తున్న క్విజ్ పోటీలలో పాల్గొనాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరేట్లోని కలెక్టర్ ఛాంబర్ లో భారతీయ రిజర్వ్ బ్యాంక్ 90 సంవత్సరాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో నిర్వహిస్తున్న ఆన్లైన్ క్విజ్ పోటీలకు సంబంధించిన పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భారతీయ రిజర్వ్ బ్యాంకు ను స్థాపించి 90 సంవత్సరాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా రిజర్వ్ బ్యాంక్ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నారని.. అండర్ గ్రాడ్యుయేషన్ చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులందరూ ఈ పోటీలో పాల్గొనడానికి అర్హులని తెలిపారు.

# రక్షణ చట్టాలు... కఠిన శిక్షలు అవసరం




**మహిళలపై ఏదొక మూల ఏదొక అఘాయిత్యం నిత్యం జరుగుతూనే ఉన్నాయి. కోల్‌కతా ఘటన మరింత అమానవీయం. ప్రాణాలు పోసే డాక్టర్లకే ప్రాణాపాయం కలుగుతుంటే ఇక విధులు ఏం నిర్వహిస్తాం... రోగులకు ప్రాణాలు ఎలా పోస్తాం... అని ప్రశ్నిస్తున్న వైదులు, సిబ్బంది. రక్షణ చట్టాలు చేయాలని, కఠిన శిక్షలు అమలు చేయాలని, అప్పుడే ఇటువంటి ఘటనలను కట్టుదిట్టం చేయొచ్చు అంటున్నారు వారు.. కోల్‌కతా ఘటనా నేపథ్యంలో పలువురు వైద్యులు, ఆ రంగంలో పనిచేస్తున్న సిబ్బంది తమ వాణిని ఇలా వినిపించారు... వారి మాటల్లోనే..**

## రక్షణ కోసం పోరాటం



ఈ సమ్మె ప్రారంభించింది కేవలం కోల్‌కత్తా ఘటనపై నిరసన మాత్రమే కాదు. ఆరోగ్య కార్యకర్తలు, ముఖ్యంగా రాత్రిపూట డ్యూటీ చేస్తున్న మహిళా డాక్టర్లు ఎదుర్కొనే ప్రమాదాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలనే విజ్ఞప్తి కోసం చేస్తున్నాం. కావున ప్రభుత్వం వెంటనే ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా రక్షణ చట్టాలు చేయాలి.

**- డాక్టర్ దాసరి రోహిత్, జూనియర్ వైద్యులు, జిజిహెచ్. కాకినాడ**

## విధులకు రావాలంటే భయం వేస్తుంది



వైద్య వృత్తి చాలా కీలకమైనదిగా భావిస్తూ నిర్వర్తిస్తున్నాం. అయితే ఇటీవల జరిగిన ఘటనను చూసి భయం భయంగా గడపాల్సి వస్తుంది. రాత్రిపూట డ్యూటీకి వెళ్లడం మరింత భయంకరంగా మారింది. మేము రోగుల జీవితాలను కాపాడటానికి కృషి చేస్తుంటాం. కానీ ఇప్పుడు మా ప్రాణాల కోసం భయపడాల్సిన పరిస్థితి వచ్చింది. సెంట్రల్ ప్రొటెక్షన్ చట్టం తీసుకుని రావాలి. దీని కోసమే మా ఆందోళనలు.

**- డాక్టర్ తేజశ్వీ, జూనియర్ డాక్టర్, జిజిహెచ్, కాకినాడ**

## ప్రభుత్వానిదే బాధ్యత



జూనియర్ వైద్యురాలి ఘటనపై పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలి. ఓ మహిళా ముఖ్యమంత్రి సారథ్యం వహిస్తున్న రాష్ట్రంలో ఇటువంటి ఘోరం చోటు చేసుకోవడం బాధాకరం. అక్కడి పాలక పక్షం ఆత్మ విమర్శ చేసుకోవాల్సిన అవసరం ఉంది. కాలేజీలు మొదలుకొని, యూనివర్శిటీలు, పనిప్రదేశాలలో మహిళలపై వేధింపులు కొనసాగుతున్నాయి. పురుషాధిపత్యం కొనసాగుతోంది. ఈ పరిస్థితులు మార్చాల్సిన అవసరం ఉంది. మహిళలకు రక్షణ కల్పించేలా చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి. దోషులు ఎంతటి వారైనా శిక్షించాలి.

**- ఎస్.కృష్ణ, మెడికల్ రిప్రజెంటేటివ్, రాజమహేంద్రవరం**

## ప్రభుత్వాలు కళ్లు తెరవాలి



కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలి. దేశ వ్యాప్తంగా వైద్య సిబ్బంది రక్షణకు సమగ్ర చట్టం చేయాలి. నిందితులతో పాటూ నిందితులను కాపాడాలనుకే వారికి కఠిన శిక్ష విధించాలి. దేశంలో అన్ని స్థాయిల్లో లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు ఏర్పాటు చేయాలి. అందరి ప్రాణాలు కాపాడే వైద్యులకే ఇటువంటి పరిస్థితి ఏర్పడితే ఇక సామాన్యుల పరిస్థితి ఏంటి? ప్రభుత్వాలు ఇప్పటికైనా కళ్లు తెరవాలి. కఠినమైన చట్టాలు అమలు చేయాలి.

**- ఎ.ఇంద్రావతి, ప్రభుత్వ వైద్యురాలు, అమలాపురం**

## పునరావృతం కారాదు...



వైద్యులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యతను ప్రభుత్వం తీసుకోవాలి. అత్యాచార నిందితులను బహిరంగంగా ఉరితీసే చట్టాలు చేయాలి. జరిగిన ఘటనపై వివిధ రూపాల్లో ఆందోళనలు చేశాం. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కూడా అత్యవసర సేవలు మినహాయించి ఒపిని నిలిపివేసి ఆందోళనలు చేశాం. ప్రజల కూడా మద్దతు తెలిపారు.

**- డాక్టర్ పార్వతి చంద్రాభట్ల, జూనియర్ డాక్టర్, కాకినాడ**

## కఠిన చర్యలు ఉండాలి



వైద్యులపై దాడులు నిత్యం జరుగుతున్నాయి. వైద్య వృత్తిలో అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నాం. పని ప్రదేశంలో భద్రత లేకుండా పోతోంది. ఇలాంటి పరిస్థితుల నడుమ విధులను నిర్వహించడం కూడా కష్టమే. దాడులకు దిగుతున్న వారిపై కఠిన చర్యలు ఉండాలి. ఈ మేరకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి.

**- డాక్టర్ బి.అమృతవల్లి, జూనియర్ డాక్టర్, జిజిహెచ్ కాకినాడ**

# శ్రీహరి ఆసుపత్రిపై చర్యలు తీసుకోవాలి

- మృతుని కుటుంబానికి రూ.25లక్షల నష్ట పరిహారం ఇవ్వాలి
- సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు డిమాండ్

ప్రజాశక్తి-అమలాపురం

వైద్యం వికటించి వ్యక్తి మృతికి కారణమైన శ్రీహరి ఆసుపత్రిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కారెం వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మృతుని కుటుంబానికి రూ.25 లక్షల నష్టపరిహారం ఇవ్వాలన్నారు. వివరాలు ఇవి.. అమలాపురం పట్టణంలో శ్రీహరి ఆసుపత్రిలో మామిడికుదురు మండలం పెదపట్నం లంక గ్రామానికి చెందిన బి.కనకరాజు (53) అనారోగ్యంతో బుధవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే కనకరాజు మృతి చెందాడని కుటుంబ సభ్యులు, బంధువులు ఆసుపత్రి వద్ద ఆందోళనకు చేశారు. ఈ ఘటనపై సిపిఎం జిల్లా కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ శ్రీహరి ఆసుపత్రిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆసుపత్రి గుర్తింపు రద్దు చేయాలన్నారు. ప్రయివేటు ఆసుపత్రుల ఆగడాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని దీనిని నియంత్రించాల్సిన ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖ ముఖ్యంగా డిఎంహెచ్ఒ విఫలం అవుతున్నారని విమర్శించారు. గతంలో కూడా ఇటువంటి ఆరోపణలు శ్రీహరి ఆసుపత్రి పై వచ్చాయని ఈ నేపథ్యంలో ఆసుపత్రి గుర్తింపుని రద్దు చేయాలని చర్యలు తీసుకోవాలన్నారు. కనకరాజు మృతికి కారణమైనటు వంటి వైదునిపై చట్టపరమైన చర్య తీసుకోవాలన్నారు.

# సాగునీటి సంఘాల ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్

## రైతుల్లో ఆనందోత్సవాలు


మామిడికుదురులో బలహీనంగా కాలువ గట్లు, వృథాగా సాగునీరు

ప్రజాశక్తి-మామిడికుదురు

సాగునీటి సంఘాల ఎన్నికలకు సెప్టెంబర్ నెలాఖరులోగా నిర్వహించాలని కూటమి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు ఇటీవల జరిగిన రాష్ట్ర కేబినెట్ మంత్రి వర్గ సమావేశంలో ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తుండడంతో రైతుల్లో ఆనందోత్సవాలు వెల్లువెత్తుతున్నాయి. రైతుల అవసరాలు తీర్చడంలో, సాగునీటి అభివృద్ధి, సంఘాలలో జవాబుదారీతనం ఎలా పెంచాలో ఆలోచించి ఎన్నికలునిర్వహించాలనిప్రభుత్వం నిర్ణయం తీసుకుంది 2014-19 వరకు టిడిపి ప్రభుత్వం జల వనరుల శాఖలు అమలు చేసిన సాగునీటి సంఘాలు రైతులకు ఎంతో జవాబుదారీగా ఉంటూ మురుగు కాలువలు బాగు చేయటం, బలహీన కాలువ గట్లు మరమ్మతులు వంటి నిర్వహణ పనులతో ఆయకట్టుకు సాగునీటి సమస్య ఉండేది కాదు. రైతుల నుంచే సాగునీటి వినియోగదారుల సంఘాలు నుంచి డిస్టబ్యూటరీ కమిటీలును ఈ డిస్రిబ్యూటరీ కమిటీలు నుంచి ప్రాజెక్టు కమిటీలను ఏర్పాటు చేసేవారు వీటికి సంబంధించి ఛైర్మన్లు, సభ్యులు వారి పరిధిలో ఏటా క్లోజర్ పీరియడ్ సమయం లో పంట కాలువలు బాగుచేయటం, ప్రధానంగా రెండో పంట రబీ సాగుకు నీటి ఎద్దడి లేకుండా క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి జలవనరుల శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించేవారు. ఈ వ్యవసకు గత వైసిపి ప్రభుత్వం చరమగీతం పాడేసింది. మేలో జరిగిన సాధారణ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సాగునీటి సంఘాల ఎన్నికలకు పచ్చాజెండా ఊపింది.

**నియామకాలపై ప్రారంభమైన చర్చ**

సాగునీటి సంఘాల్లో కూటమి ప్రభుత్వం పార్టీల కతీతంగా ఎవరిని నియమించాలనే చర్చ ప్రజాప్రతినిధులలో మొదలైంది. 2015 లో సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరిగాయి. గత వైసిపి ప్రభుత్వంలో సాగునీటి సంఘాల ఎన్నికల ఊసే లేదు. మేజర్, మైనర్ ఇరిగేషన్, ప్రాజెక్ట్ మూడు పద్ధతుల్లో ఎన్నిక ఉంటుంది. మేజర్, మైనర్ ఇరిగేషన్‌కు విడిగా ఎన్నికలు నిర్వహించి వాటర్ డిస్ట్రిబ్యూషన్ అసోసియేషన్ కమిటీల్లో ఛైర్మన్, వైస్‌ఛైర్మన్లతో పాటు నలుగురు కమిటీ సభ్యులను ఎన్నుకుంటారు. డిస్ట్రి బ్యూషన్ కమిటీలు ప్రాజెక్టు కమిటీలను ఎన్నుకుంటారు

**జిల్లాల విభజన నేపథ్యంలో తొలిసారిగా**

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాలుగా విభజించబడింది ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన లేక జిల్లాల ప్రాతిపదికన ఎన్నికల జరుగుతాయాన్నది చర్చనీయాంశంగా మారింది. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పూర్తిస్థాయిలో సెంట్రల్ డెల్టా ఆయకట్టు ఉండగా 1.76 లక్షల ఎకరాలు ఆయకట్టు సాగవుతోంది తూర్పు డెల్టా పరిధిలో మండపేట, రాయవరం, రామచంద్రపురం, కపిలేశ్వరపురం, కె.గంగవరం, ఆలమూరు మండలాలు జిల్లాలో కలిశాయి ఈ మండలాల పరిధిలో 70 వేల ఎకరాల ఆయకట్టు కు తూర్పు డెల్టా నుంచి సాగునీరు అందుతుంది. జిల్లాలో మొత్తం 2.46 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. డెల్టా ఆయకట్టులో జిల్లా ఆయకట్టు అగ్రభాగాన నిలిచింది వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీలు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆధ్వర్యంలో, ప్రాజెక్టు కమిటీలు, సూపరింటెండెంట్ ఇంజినీర్ ఆధ్వర్యంలో జరగనున్నాయి. కమిటీలలో సభ్యుల ఎన్నిక కలెక్టర్ ఆధ్వర్యంలో జరగనుంది.

**గతంలో సాగు నీటి సంఘాలు ఇలా**

గోదావరి డెల్టా (మేజర్ ఇరిగేషన్) కు తూర్పు డెల్టా, సెంట్రల్ డెల్టా ఎఐ డివిజన్ (పెద్దాపురం), స్పెషల్ ఎంఐ డివిజన్ రంపచోడవరం పరిధిలో 144 సాగునీటి సంఘాలు, 25 సాగు నీటి పంపిణీ కమిటీలు, ఒక ప్రాజెక్టు కమిటీ ఏలేరు రిజర్వాయర్ పరిధిలో 25 సాగు నీటి సంఘాలు, అయిదు సాగునీటి పంపిణీ కమిటీలు, ఒక ప్రాజెక్టు కమిటీ.తొర్రిగడ్డ పంపింగ్ స్కీమ్‌కు సంబంధించి నాలుగు సాగు నీటి సంఘాలు, ఒక ప్రాజెక్టు కమిటీ. సుబ్బారెడ్డి సాగర్ ప్రాజెక్టు పరిధిలో 6సాగునీటి సంఘాలు, ఒక ప్రాజెక్టు కమిటీ, మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు సంబంధించి 216 సాగు నీటి సంఘాలు ఉమ్మడి జిల్లాలో మొత్తం 401 సాగు నీటి సంఘాలు, 30 సాగునీటి పంపిణీ కమిటీలు, ఐదు ప్రాజెక్టు కమిటీలు ఉండేవి. ఉమ్మడి కూటమి ప్రభుత్వం అధికారంలో రావడంతో మళ్లీ సాగునీటి సంఘల ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది

# 31న పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి-అమలాపురం

సెప్టెంబర్ నెల ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పింఛన్లను ఆగస్టు 31 నే లబ్ధిదారులకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లో సెప్టెంబర్ పెన్షన్ల పంపిణీపై ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో పీడీ డిఆర్‌డిఎ డాక్టర్ శివ శంకర్ ప్రసాద్, లీడ్ బ్యాంకు మేనేజర్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా తెలుగు భాషా దినోత్సవం


అమలాపురం కలెక్టరేట్‌లో తెలుగు భాషా దినోత్సవంలో పాల్గొన్న జెసి

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలో ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో తెలుగు భాషా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. గిడుగు రామూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలుచోట్ల వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

**అమలాపురం:** తెలుగు వ్యవహారిక భాషోద్యమానికి గిడుగు వెంకట రామమూర్తి పంతులు పితామహుడని జాయింట్ కలెక్టర్ కొనియాడారు. కలెక్టరేట్లో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డిఆర్ఒ ఎం.వెంకటేశ్వర్లు, డిఇఒ కమల కుమారి కలెక్టరేట్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. **రాజోలు:** తెలుగు భాష పరిరక్షణకు ప్రతీఒక్కరు పాటుపడాలని తెలుగు ఉపాధ్యాయులు పెద్దింటి శేష ప్రసాద్ అన్నారు తెలుగు భాషా దినోత్సవం గా మలికిపురం మండలం ,విశ్వేశ్వరాయపురం లోని వివేకానంద ఆంగ్ల మాధ్యమ ఉన్నత పాఠశాల ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరెస్పాండంట్ పి.వి.వి.వర ప్రసాద్, అడ్వైసర్ నక్కా రమేష్ ఉపాధ్యాయులు ,తెలుగు అధ్యాపకులు శేష ప్రసాద్ ను సన్మానించారు. **ఐ.పోలవరం:** తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలుగు వెలుగు నిర్వహించే కార్యక్రమాల్లో పిటిఎం.ఆధ్వర్యంలో భాగంగా ఐ.పోలవరం వివిఎస్ఎన్ఆర్.జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు డాక్టర్ పుల్లెపు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తెలుగు భాషను ఆత్మగౌరవ భాషగా చూడాలని వక్తలు కోరారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపల్ ఎం రవికుమార్, కె.శ్రీనివాస్,విత్తనాలు వరప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు. **కడియం:** మండపేట కు చెందిన ఉపాధ్యాయుడు, జన విజ్ఞాన వేదిక నాయకుడు గండి స్వామి ప్రసాద్ తెలుగు భాష అభివద్ధికి చేస్తున్న సేవలకు గుర్తింపుగా అభ్యుదయ రచయితల సంఘం తెలుగు భాషా పురస్కారాన్ని అందజేసింది. రాజమండ్రిలో రాజమహేంద్రి విద్యాసంస్థలు, అరసం సంయుక్త ఆధ్వర్యంలో రాజమహేంద్రి డిగ్రీ కళాశాల లో నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవ వేడుకలలో అరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పడాల వీరభద్రరావు, రాజమహేంద్రి విద్యాసంస్థల ఛైర్మన్ టి.కే.విశ్వేశ్వర్ రెడ్డి, రాజమహేంద్రి కళాశాల ప్రిన్సిపల్ తేతలి సౌందర్య చేతులమీదుగా స్వామి ప్రసాద్ పురస్కారాన్ని అందుకున్నారు. కార్యక్రమంలో నన్నయ విశ్వవిద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.ఎస్. వరహాల దొర, విశ్రాంత న్యాయమూర్తి ఎస్సార్ పథ్వి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి ప్రసాద్ ను జెవివి రాష్ట్ర చీఫ్ ప్యాట్రన్ డాక్టర్ చల్లా రవికుమార్, రాష్ట్ర కార్యదర్శి కె.వివి. సత్యనారాయణ మండపేట యుటిఎఫ్ అధ్యక్షులు పి రామచంద్రా రెడ్డి, ద్వారపూడి జెడ్‌పి హైస్కూల్ హెచ్‌ఎం సవితాల సుబ్రహ్మణ్యం తదితరులు అభినందించారు. **అమలాపురం రూరల్ :** అమలాపురం స్థానిక శ్రీ వెంకటేశ్వర డిగ్రీ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో మాతభాష దినోత్సవ వేడుకలు గురువారం విద్యార్థులు,అధ్యాపకులు సమక్షంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కేవీఆర్ఎన్ నరసింహారావు, ప్రిన్సిపల్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం:** తెలుగు సాహిత్యంలో చారిత్రాత్మక మార్పుకు శ్రీకారం చుట్టిన మహోన్నతుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు అని సీనియర్ తెలుగు అధ్యాపకుడు ఉభయ తెలుగు రాష్ట్రాల తెలుగు అధ్యాపక సంఘం గౌరవ ఉపాధ్యక్షులు ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ నల్లా నర్సింహ మూర్తి అన్నారు.భీమనపల్లి పంచాయతీ భట్నపాలెంలోని ఎవిఎస్ఎన్ జూనియర్ కాలేజ్, అమత ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ప్రిన్సిపల్ అడపా గోపాలకష్ణ అధ్యక్షతన తెలుగు భాష దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్ ఛార్జ్ ప్రిన్సిపాల్ మధుర కపానందం, స్కూల్ హెచ్‌ఎం,నల్లా సరస్వతి దేవి అధ్యాపకులు పాల్గొన్నారు. **అంబాజీపేట :** హైస్కూల్లో తెలుగు భాషా దినోత్సవం హెచ్‌ఎం సాయిరాం అధ్యక్షతన నిర్వహించారు. వ్యాస రచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. **అయినవిల్లి :** ముక్తేశ్వరం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు జయంతి పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిమ్మకాయల గణేశ్వరరావు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగు భాష ఉపాధ్యాయులు పి. రామచంద్రరావు, డి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం



ముక్తేశ్వరం జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో జాతీయ క్రీడా దినోత్సవం

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలో ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, కళాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ క్రీడా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడల్లో ప్రతిభ చూపిన వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పలుచోట్ల క్రీడాకారులకు స్పోర్ట్ కిట్లు అందజేశారు.

**అమలాపురం:** క్రీడా స్ఫూర్తిని చాటుతూ త్రీ కే రన్ ను నిర్వహించినట్లు జిల్లా జెసి టి.నిషాంతి తెలిపారు. ఈ ర్యాలీని కలెక్టరేట్ వద్ద ఎంఎల్ఎ అయితా బత్తుల ఆనంద రావు ప్రారంభించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆధ్వర్యంలో 39 మంది క్రీడాకారులకు ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్ర మంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, డిఇఒ ఎం. కమలకుమారి జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ము ఖ్య శిక్షకులు జిల్లా స్పోర్ట్స్ అభివద్ధి అధికారి పిఎస్ సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. **మామిడికుదురు :** పెదపట్నంలంక హైస్కూల్లో హెచ్ ఎం కె. హర్నాథ్ క్రీడల ప్రాధాన్యత వివరించారు పాఠశాలకు రూ.20వేల వ్యయం తో క్రీడా దుస్తులు, క్రీడా పరికరాలు బహుకరించిన దాత మామిడిసెట్టి హనుమంతరావును సత్కరించారు. **రాజోలు :** విద్యార్థులు విద్య తో పాటు క్రీడల్లో రాణించాలని రాజోలు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ సూచించారు.గురువారం రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ క్రిడా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ మానేపల్లి అయ్యాజీవేమా,సర్పంచ్ రేవు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.


కిట్స్‌లో జాతీయ క్రీడల దినోత్సవం

**అయినవిల్లి :** ముక్తేశ్వరం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని హెచ్‌ఎం నిమ్మకాయల గణేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో పీడీ రమేష్, జి.సాయి శ్రీనివాస్, వై.ఫణి కుమార్ పాల్గొన్నారు. **కాట్రేనికోన:** చెయ్యేరు శ్రీనివాస స్వయం ప్రతిపత్తి ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవమును కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీనివాస కుమార్, కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ డివిఎస్ఎస్.వర్మ , కళాశాల పాలక వర్గ సభ్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. **అంబాజీపేట** అంబాజీపేట హైస్కూల్ లో జాతీయ క్రీడా దినోత్సవాలు గురువారం హెచ్‌ఎం సాయిరాం అధ్యక్షతన నిర్వహించారు. కొర్లపాటి ప్రసాదరావు మాజీ సర్పంచ్ జ్ఞాపకార్థం రూ.6వేలు విలువైన క్రీడా సామగ్రి ఆయన కుటుంబ సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎంసి ఛైర్మన్ పితాని త్రిమూర్తులు, వైస్ ఛైర్మన్ బండారు అమ్మాజీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

**విద్యతో పాటూ క్రీడలు అవసరం**


**రామచంద్రపురం:** అంబిక పల్లి అగ్రహారం లో శ్రీ రాజారత్న కిట్స్ కాలేజీలో జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు అత్యవసరమని,కార్యక్రమంలో వివిధ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఎంవి.పవన్ కుమార్ మాట్లాడారు. కార్యక్రమం జనసేన నాయకులు పోలిశెట్టి చంద్రశేఖర్, ఎం సాగర్, రవిధర్, రామారావు, శ్రీకాంత్, సాయి కాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంఎపిడిఓ, ఎంపిపి

# సీజనల్ వ్యాధులపై సదస్సు

ప్రజాశక్తి-అంబాజీపేట

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి దొమ్మేటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన గురువారం పంచాయతీ కార్యదర్శులకు, ఆరోగ్య సిబ్బందికి ఆరోగ్య సమస్యలపై సదస్సు నిర్వహించారు. ఎంపిడిఒ జివి.సరోవరరావు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు వ్యాపిస్తుండడంతో కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బంది ముందస్తు చర్యలపై సదస్సు నిర్వహించి క్షేత్రస్థాయిలో మరింత దృష్టి సారించి చర్యలు చేపట్టాలన్నారు. జూన్ నెల నుంచి డైయేరియా సర్వే, లెప్రసి సర్వే,ప్రస్తుతం పీవర్ సర్వే క్షేత్రస్థాయిలో ఇంటింటా తిరిగి ప్రజల పనిచేస్యున్నామని ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలుపుతూ కొందరు సరిగ్గా పనిచేయడం లేదని ఆరోపించడం సబబు కాదని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎస్తేరురాణి తెలిపారు. కార్యక్రమంలో అంబాజీపేట పిహెచ్‌సి వైద్యులు కె.ఎన్.శ్రీనివాస్ పంచాయతీ కార్యదర్శులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.




# రొయ్యల చెరువుల తవ్వకాలు నిలిపివేయాలి

కొత్తకోటలో గ్రామస్తుల ధర్నా


కొత్తకోటలో మెయిన్ రోడ్డుపై గ్రామస్తుల ధర్నా

ప్రజాశక్తి-రామచంద్రపురం

హైకోర్టు ఆదేశాలను సైతం లెక్కచేయకుండా కె.గంగవరం మండలంలో కొత్తకోట గ్రామంలో అక్రమంగా రొయ్యలు చెరువులు తవ్వకాలపై గురువారం గ్రామస్తులు ధర్నా నిర్వహించారు. గ్రామంలో ఇప్పటికీ ఆరు ఎకరాలు చెరువులు తవ్వి వాటిని చేపల చెరువుల పేరిట అనుమతులు తీసుకుని రొయ్య పిల్లలను తీసుకువచ్చి సీడ్ వేసేందుకు ప్రయత్నించగా బుధవారం గ్రామస్తులు దీనిని గమనించి అడ్డుకున్నారు. దీనిపై గ్రామస్తులు బిమ్మేటి త్రిమూర్తులు, వాసంశెట్టి వెంకటరమణ, కంచి సత్తిబాబు, కుక్కల రమేష్, పిల్లి నాగేశ్వరరావు, పి.శ్రీనివాసు మాట్లాడారు. ఇప్పటికే గ్రామంలో మంచినీటి చెరువులు, బావులు కలుషితున్నాయని గ్రామస్తులు ఆందోళనకు దిగారు. కె.గంగవరం మండలంలో అయిదేళ్లగా రొయ్యలు చెరువులు మూసివేయాలనిఅధికారులకు ఫిర్యాదు చేసిన ఫలితంగా దక్కకపోవడంతో జనవరి నెలలో దీనిపై గ్రామస్తులు రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు చేపల చెరువుల కొనసాగించాలని ఉప్పునీటి రొయ్యల చెరువులు మూసివేయాలని ఆదేశాలిచ్చింది. అయితే నిర్వాహకులు హైకోర్టు ఆదేశాలను పక్కనపెట్టి యథా విధిగా రొయ్యల పెంపకం చేస్తున్నారు. దీనిపై మత్స్య శాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిం చడంతో చేపల చెరువుల మాటున రొయ్యల చెరువుల్లో రొయ్యల పెంపకం కొనసాగుతోంది. గత వైసిపి ప్రభుత్వ హయాం లో గతంలో మంత్రి వేణు దొడ్డి దారిన రొయ్యల చెరు వుల యజమానులకు అనుకూల ంగా వ్యవహరిం చడంతో యథేచ్ఛగా అక్రమ రొయ్యల చెరు వులు కొనసాగుతు న్నాయి. దీనితో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని శాంతిభద్రతలు పర్యవేక్షించారు.


కొత్తకోటలో అక్రమంగా తవ్విన రొయ్యల చెరువులు ఇవే

# ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు



మాట్లాడుతున్న నగరం ఎస్‌ఐ చైతన్యకుమార్


ప్రజాశక్తి- మామిడికుదురు

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని నగరం ఎస్ఐ ఎ.చైతన్య కుమార్ అన్నారు. మామిడికుదురు దీప్తి డిగ్రీ కళాశాల్లో ప్రిన్సిపల్ డివివి.సత్యనారాయణ అధ్యక్షతన గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా యాంటీ ర్యాగింగ్ చట్టంపై డిగ్రీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా ఎస్ఐ హాజరై మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో ర్యాగింగ్ పై నిషేధం ఉందన్నారు. ర్యాగింగ్ కు పాల్పడితే శిక్ష తప్పదని హెచ్చరించారు. ఎవరైనా ర్యాగింగ్ లు చేసిన ఎలాంటి ఇబ్బందులు పెట్టినా అధ్యాపకులకు తెలపాలన్నారు. విద్యార్థుల మేలు కోసం ప్రభు త్వాలు కృషి చేస్తున్నామన్నారు. ర్యాగింగ్ కు పాల్పడి తమ విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. విద్యార్థినుల పట్ల గౌరవంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సహాయ ప్రిన్సిపల్ మోకా రంగారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వనువులమ్మకు వెండి కిరీటం బహూకరణ

ప్రజాశక్తి -మామిడికుదురు

పెదపట్నంలంకలో గిడుగువారి పాలెం గ్రామ దేవత వనువులమ్మ అమ్మ వారికి రూ.నాలుగు లక్షలు విలువైన అయిదు కేజీల వెండి కిరీటాన్ని యాత్రికులు గురువారం సమర్పించారు అంకం వెంకట శ్రీనివాస్ ఆధ్వర్యంలో కిరీటానికి సంప్రోక్షణ, పూజలు నిర్వహించి అమ్మవారికి అలంకరించారు. గిడుగు వారి పాలెం వాసులు ఆడపడుచుల విరాళాలతో కిరీటం చేయించారని ఆలయ కమిటీ తెలిపి


దాత దంపతులను సత్కరిస్తున్న సర్పంచ్, హెచ్ఎం

# అదనపు భవన నిర్మాణానికి ఎన్ఆర్ఐ సహకారం

ప్రజాశక్తి-మామిడికుదురు

ఆదుర్రు ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో ఎన్ఆర్ఐ రూ.26 లక్షల వ్యయంతో నిర్మించిన రెండు అదనపు గదులు స్కూలు భవనాన్ని గురువారం సర్పంచ్ బళ్ళ శ్రీనివాసరావుకు, హెచ్ఎం పల్లం రాజులకు భవనాన్ని అప్పగించారు. అదే పాఠశాలలో చదువుకుని శాస్త్రవేత్తగా అమెరికాలో స్థిరపడిన లక్ష్మీనరసింహా ఛైనులు అన్నపూర్ణ దంపతులు స్కూలు భవనాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ, ఎంపిపి కుసుమ వనజ కుమారి, ఎంఇఒలు లక్ష్మీనారాయణ, వెంకన్నబాబులు దాత దంపతులను అభినందించారు. అనంతరం దాత దంపతులను సర్పంచ్, హెచ్ఎం శాలువాతో సత్కరించి అభినందించారు

## నేరాలు ఘోరాలు

### రోడ్డు ప్రమాదంలో గాయపడిన జర్నలిస్టు మృతి

ప్రజాశక్తి - కాకినాడ

తుని ఏరియాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జర్నలిస్టు యలమంచిలి శ్రీనివాసరావు గురువారం మృతి చెందాడు. గత 10 రోజుల క్రితం గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిన ప్రమాదంలో శ్రీనివాసరావు తలకు తీవ్ర గాయమైంది. అప్పటి నుంచి ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందారు. మూడు రోజుల క్రితం కోలుకోవడంతో ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. అయితే గురువారం ఆరోగ్యం క్షీణించడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. చికిత్స ప్రారంభించిన కొద్ది సమయం లోగానే పరిస్థితి విషమించి మృతి చెందారు. శ్రీనివాసరావు మృతికి పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు, చింతపల్లి అజయ్ కుమార్, అంబటి రామకృష్ణ సంతాపం వ్యక్తం చేశారు.

### పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని మామిడాడ గ్రామ శివారున రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడిలో ఐదుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.10,150 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పేకాట వంటి జూదాలు చట్ట విరుద్ధమన్నారు. మండలంలో అసాంఘిక కార్యక్రమాలు ఎక్కడ జరుగుతున్న సమాచారం తెలపాలన్నారు. అసాంఘిక శక్తులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

### రోడ్డు ప్రమాదంలో తల్లీ, కొడుకులకు గాయాలు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

జాతీయ రహదారి 216పై జరిగిన రోడ్డు ప్రమాదంలో గురువారం ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..కాకినాడ ఇంద్రపాలెంకు చెందిన వాసంశెట్టి అశోక్ గురువారం తన తల్లి నిర్మలను తీసుకుని మోటార్ సైకిల్ పై అమలాపురం వెళుతున్నాడు. ముమ్మిడివరం పంచాయతీ పరిధిలో కాశివాని తూము సెంటర్లో వీరిని వెనక నుంచి కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ నిర్మలను కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. స్వల్పంగా గాయపడ్డ అశోక్‌ను స్థానిక ఆసుపత్రిలో చేర్పించారు. ఎస్ఐ డి.జ్వాలా సాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### సారా బట్టీలపై దాడి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలోని గోదావరి పరివాహక లంక ప్రాంతాల్లో నిర్వహిస్తున్న నాటు సారా బట్టీలపై పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 1500 లీటర్ల బెలం ఊటను ధ్వంసం చేశారు. 25 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. సారా తయారీకి ఉపయోగించే సామగ్రిని స్టేషన్‌కు తరలించారు. నిందితులను త్వరలో అరెస్టు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

### 6న జడ్‌పి సమావేశం

ప్రజాశక్తి - కాకినాడ

ఉమ్మడి తూర్పుగోదావరి జడ్‌పి సాధారణ సర్వసభ్య సమావేశం, స్థాయి సంఘాల సమావేశాలు సెప్టెంబర్ 6న స్థానిక జడ్‌పి సమావేశం మందిరంలో నిర్వహిస్తున్నట్లు జడ్‌పి సిఇఒ ఎ.శ్రీరామ చంద్రమూర్తి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి నిర్వహించే ఈ సమావేశానికి గౌరవ సభ్యు లు, అధికారులు సకాలంలో హాజరుకావాలన్నారు.

### పింఛన్ల పంపిణీపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - గండేపల్లి

ఈనెల 31న లబ్ధిదారులకు అందించే పింఛన్ల పంపిణీ పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంపిడిఒ రామన్ అన్నారు. గురువారం పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లతో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 1వ తేదీన ఇవ్వాల్సిన పింఛన్లను 31వ తేదీనే అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కావున అందుకు అనుగుణంగా సిబ్బంది 31న ఉదయం 5.30 గంటల నుంచే పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.

### ఉపాధి హామీ రికార్డుల తనిఖీ

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

అమలాపురం క్లస్టర్ లోని ఉపాధి హామీ చట్టం పనులకు సంబంధించి మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పనుల రికార్డులను తనిఖీ చేశారు. ఎంపిడిఒ కార్యాలయంలోని సమావేశపు మందిరంలో గురువారం ఉపాధి హామీ అధికారుల బృందం తనిఖీలు నిర్వహించారు. జాబ్ కార్డ్ లను వారు పరిశీలించి సక్రమంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తనిఖీ బృందంలో ఉపాధి ఎపిఒ కవిత, ప్లాంటేషన్ మేనేజర్ త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-కాట్రేనికోన

నేడు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మోకా రవికుమార్ గురువారం తెలిపారు. ఫీడర్లలో ఓవర్ లోడ్ కారణంగా వర్క్, చెట్లు తొలగింపు పనులు చేపడతారన్నారు. కాట్రేనికోన, వేట్లపాలెం, గచ్చ కాయల పొర, సిరయానం, కొండలేశ్వరం, గెద్దనాపల్లి, కొప్పి గుంట తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తారని తెలిపారు. **ముమ్మిడివరం** మండల విద్యుత్ ఉప కేంద్రం 33/11 కెవి ఫిడర్ల పరిధిలో మరమ్మతులు, ట్రీ కట్టింగ్ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఎపిఇపిడిసిఎల్ అమలాపురం డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవి కుమార్ గురువారం పేర్కొన్నారు. మండలంలో ముమ్మిడివరం ఆర్‌డబ్ల్యూఎస్ ఫీడర్ పరిధిలోని గ్రామాలు, అనాతవరం ఫీడర్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు.

### నేత్రదాన పక్షోత్సవాలపై ర్యాలీ

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

అంగర పిహెచ్‌సిలో గురువారం జాతీయ నేత్రదాన పక్షోత్సవాలపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. సెప్టెంబర్ 8వ తేదీ వరకు నిర్వహించే పక్షోత్సవాలపై వైద్యాధికారి డాక్టర్ పిఎన్ ఎస్‌డి.రత్న కుమారి వైద్య ఆరోగ్య సిబ్బందితో అవగాహన సమావేశం నిర్వహించారు.

## తేడా వస్తే సహించేది లేదు...

ప్రజాశక్తి - పెద్దాపురం


రికార్డులను పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ భావన

రెవెన్యూ రికార్డుల భద్రతలో తేడా వస్తే సహించేది లేదని ట్రైనీ కలెక్టర్ భావన హెచ్చరించారు. గురువారం స్థానిక తహశీల్దార్, రిజిస్ట్రార్ కార్యాలయాలను ఆమె ఆకస్మికంగా సందర్శించారు. కార్యాలయాల్లో ఉన్న రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా పరిధిలో ఉన్న అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో సంవత్సరాల తరబడి ఉన్న రికార్డులకు సంబంధించిన ఫైల్స్ అన్నీ భద్రంగా ఉంచాలన్నారు. ఎల్‌సిసి, అసైన్‌మెంట్ ల్యాండ్స్, ఇళ్ల స్థలాలకు సంబంధించిన రికార్డులను భద్రంగా ఉంచవలసిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. ఈ విషయంలో అజాగ్రత్తగా ఉన్న సిబ్బందిపై చర్యలు తప్పమన్నారు. రాత్రిపూట రికార్డుల భద్రత కోసం ఇద్దరు సిబ్బందిని నియమించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వెంకటలక్ష్మి, డిటి కాంతారావు, సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళలు, చిన్నారుల రక్షణ కోసం పాదయాత్ర

ప్రజాశక్తి - కాకినాడ


బృందానికి స్వాగతం పలుకుతున్న ఎస్ఎఫ్ఐ, ఆర్యవైశ్య సంఘ నాయకులు

మహిళలు, చిన్నారులకు ప్రతీ ఒక్కరూ రక్షణగా నిలవాలని, వారిపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, కలకత్తాలో వైద్య విద్యార్థులపై జరిగిన దాడిని ఖండిస్తూ విజయవాడ నుంచి కోల్‌కత్తాకు పాదయాత్ర చేపట్టారు. అకెట్ బుచ్చిబాబు, ఈడిగ ప్రదీప్ కుమార్, డి.రాధాకృష్ణ 1400 కిలోమీటర్లు చేపట్టిన పాదయాత్ర గురువారం కాకినాడ ఇంద్రపాలెం లాకుల వద్దకు చేరుకుంది. ఈ యాత్రకు భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ), ఆర్యవైశ్య సంఘం నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పాదయాత్ర బృందం సభ్యులు మాట్లాడుతూ కోల్‌కత్తాలో జూనియర్ డాక్ట ర్‌పై జరిగిన అకృత్యం ఘోరమైనదని, ఆమెకు న్యాయం చేయాలని సమాజంలో మహిళలు, చిన్నారిపై జరిగే దాడులను అరికట్టాలని తాము పాదయాత్రను చేపట్టామన్నారు. ఈ యాత్రకు మద్దతు పలికిన ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.గంగా సూరిబాబు, ఆర్యవైశ్య సంఘం నాయకురాలు నాళం ఆండాళ్ మాట్లాడుతూ నేటి సమా జంలో కొందరు యువకులు తమ స్వార్థం కోసం విచ్చలవిడితనంగా తిరుగుతున్నారని అన్నారు. సమాజంలో మహిళలకు రక్షణ కల్పించాలని ముగ్గురు యువకులు చేస్తున్న పాదయాత్ర అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కాకినాడ అధ్యక్షులు సంజయ్, ఆర్యవైశ్య సంఘం నాయకులు రజిని, కౌశిక్, సునిత, సుజాత, అంబిక పాల్గొన్నారు.

## వాణిజ్య పంటల సాగుతో అధిక ఆదాయం

ప్రజాశక్తి - ఏలేశ్వరం


రైతులకు మొక్కలను అందిస్తున్న ఎంఎల్ఎ సత్యప్రభ

వాణిజ్య పంటలను సాగు చేసుకోవడం ద్వారా అధిక ఆదాయం పొందవచ్చునని ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ అన్నారు. గురువారం ప్రతిపాడులో ఉద్యానవన శాఖ, ఎపి ఆయిల్ ఫెడ్ సంయుక్తంగా నిర్వహించిన పామాయిల్ సాగు విస్తరణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు వాణిజ్య పంటల సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భంగా ఏలేశ్వరం, ప్రత్తిపాడు మండలాలకు చెందిన 483 మంది పామాయిల్ సాగు రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ మొత్తం రూ.81 లక్షలను అందజేశారు. జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి జివివి ప్రసాద్ మాట్లాడుతూ నూతనంగా పామాయిల్ సాగు చేసే రైతులకు నూరు శాతం రాయితీపై మొక్కలు అందించడం జరుగుతుందన్నారు. పామాయిల్ మొక్కల పెంపకంతోపాటు అంతర్ పంటల సాగుకు రూ.5250 చొప్పున నాలుగేళ్లపాటు రైతులకు రూ.21 వేలను అందజేస్తామన్నారు. వీటితోపాటు 5 ఎకరాలలోపు రైతులకు 90 శాతం సబ్సిడీతో, ఐదు ఎకరాల పైబడ్డ రైతులకు 50 శాతం రాయితీతో బిందు సేద్యం, తుంపర్ల సేద్యం యంత్రాలను అందజేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని వాణిజ్య పంటల రైతులు వినియోగించుకోవాలని కోరారు.

## ఆర్ అండ్ బి రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి - కోటనందూరు


రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

నర్సీపట్నం నుంచి తుని వెళ్లే ప్రధాన రహదారిలోని కాకరపల్లి గ్రామ శివారున గోతులు పడిన రోడ్డుకు మరమ్మతు పనులను గురువారం చేపట్టారు. గ్రామ జనసేన నాయకులు తాతాజీ, రాజు, ధనాజీ, అమల తదితరులు రోడ్డు దుస్థితిని అర్ అండ్ బి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆర్ అండ్ బి అధికారులు స్పందించి గురువారం రోడ్డుకు మరమ్మతు పనులు చేపట్టారు.

## విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

క్రీడల్లో ఉత్తమ ప్రతిభను చాటుకుంటున్న ఉప్పాడ జడ్‌పి హైస్కూల్‌కు చెందిన క్రీడాకారులకు వాకర్స్ క్లబ్ సభ్యులు బంధన వీరమణికంఠ, చోడిశెట్టి సతీష్, కొవ్వూరి విజయ్ క్రీడ దుస్తులను గురువారం అందించారు. క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థులను ప్రోత్సహించే లక్ష్యంతో వారికి అవసరమైన దుస్తులను అందించినట్లు వాకర్స్ క్లబ్ సభ్యులు, దాత బంధన వీరమణికంఠ అన్నారు. ఆటల్లో రాణిస్తున్న వారిని ప్రోత్సహించేందుకు వాకర్స్ క్లబ్ ముందు ఉంటుందన్నారు. క్రీడల పట్ల మక్కువ చూపుతున్న విద్యార్థులకు ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. ఉప్పాడ పాఠశాల విద్యార్థులు స్టేట్ లెవెల్ ఛాంపియన్స్ షిప్‌లో రాణించేలా తీర్చిదిద్దాలని పిటి ఉపాధ్యాయులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి ఛైర్మన్ వనమాడి తాతబ్బాయి, సికోటి బుజ్జి, స్పోర్ట్స్ అధ్యక్షుడు వంక దానియేల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఇకెవైసిని పూర్తి చేయాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

ఈక్రాప్ అయిన రైతులకు వెంటనే ఇకెవైసిని పూర్తి చేయాలని ఎడిఎ నల్లి దైవకుమార్ సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తహశీల్దార్ వెంకటలక్ష్మి అధ్యక్షతన విఆర్ఒలు, రైతు కేంద్రాల సిబ్బందికి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని అంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకుని త్వరిత గతిని రికార్డులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె.సంజయ్‌కుమార్, మండల వ్యవసాయ విస్తరణ అధికారి ఎన్‌వివి.ప్రసాద్ పాల్గొన్నారు.

## పాస్‌పోర్టు పడిపోయినది

కాకినాడ జిల్లా, సామర్లకోట మండలం, వేట్లపాలెం, హరిజనపేట, గూడవర్తి గ్రామ వాసి అయిన **కలగపూడి స్వర్ణ** అను నేను సామర్లకోటలో ది.**25-07-2024**వ తేదీన జిరాక్సు కోసం వెడుతుండగా మార్గ మధ్యలో నా పాస్‌పోర్టు పోయినది. నా పాస్‌పోర్టు నెంబరు: **ఎన్ 4744668.** కావున ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరని కోరుతున్నాను.

**కలగపూడి స్వర్ణ వై/ం. రమణ**
**డోర్ నెం. 15-23, హరిజనపేట, గూడవర్తి,**
**వేట్లపాలెం - 533434**
**సామర్లకోట మండలం. కాకినాడ జిల్లా**
**ఫోన్ నెం. 7997779893**

## రైతులకు పొలంబడి ద్వారా అవగాహన

ప్రజాశక్తి - గండేపల్లి, జగ్గంపేట

గండేపల్లి గ్రామంలో గురువారం గాప్ పొలంబడి(మంచి వ్యవసాయ పద్ధతులు) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సద్గురుమూర్తి పాల్గొని పురుగు మందులు విషతుల్యంపై గుర్తులను చూపించి అవగాహన కల్పించారు. రైతులెవరూ మోతాదుకు మించి ఎట్టి పరిస్థితుల్లోనూ వాడరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రమ్య మాట్లాడుతూ నేలను 365 రోజులు అచ్ఛేదనం ద్వారా కప్పి ఉంచడం వల్ల నేల భౌతిక ఆరోగ్యాన్ని రంక్షించుకోవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు కంటిపూడి రామారావు, విఎఎ అంజలి, విహెచ్ఎ ఉదయ్, రైతులు పాల్గొన్నారు. అలాగే జగ్గంపేట మండలంలోని గొల్లలగుంటలో గురువారం మండల వ్యవసాయాధికారి రెడ్డ శ్రీరామ్ ఆధ్వర్యంలో పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మెనేజ్‌మెంట్‌లో భాగంగా లింగకర్షక బుట్టలు, పక్షి స్థావరాలు ఏర్పాటు చేసుకోవాలని రైతులకు సూచించారు. లింగకర్షణ బుట్టలు తెల్ల దోమ, నల్ల దోమ, పచ్చ దోమతోపాటు రకరకాల దోమలను ఆకర్షిస్తాయని అన్నారు. ఈ ప్రక్రియ ద్వారా ఎటువంటి దోమలు బెడద ఎక్కువగా ఉందో గుర్తించి వాటికి క్రిమి సంహార మందులు వాడవచ్చన్నారు. ఎకరానికి 10 బట్టలు చొప్పున ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో బీజామృత్తం తయారు చేయడాన్ని రైతులకు డెమో ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## తాళ్లరేవులో వైద్య శిబిరం

ప్రజాశక్తి - తాళ్లరేవు


రక్తదానం చేస్తున్న విద్యార్థిని

గాడిమొగ పిహెచ్‌సి వైద్యులు తాళ్లరేవులో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సిహెచ్‌సిలో రక్త పరీక్షా విభాగం వద్ద గంటల కొలదీ ఉండాల్సివస్తుందని, జూనియర్ వైద్యులచే వైద్య సేవలు అందిస్తున్నారంటూ వైద్య శిబిరం వద్ద సిబ్బందిని స్థానికులు నిలదీశారు. స్థానిక సమస్యలను వైద్యాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఎంపిహెచ్ఎస్ బొడ్డు కుమార్ హామీ ఇచ్చారు. అనంతరం శిబిరానికి వచ్చిన వారికి అవసరమైన మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వి.లక్ష్మి, ఎఎన్ఎంలు రోజా, జ్యోతి, వెంకటరత్నం, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## సెప్టెంబర్ మూడో వారంలో రాజధానికి ర్యాలీ

**కాకినాడ రూరల్**: గ్రామాల విలీనం ప్రక్రియ పూర్తి చేయాలని కోరుతూ సెప్టెంబర్ మూడో వారంలో ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయానికి ద్విచక్ర వాహన ర్యాలీని నిర్వహించనున్నట్లు పౌర సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అంతకుముందుగా నగర సదస్సును నిర్వహిస్తామని ప్రకటించారు.

## ఇసుక తరలించిన వారిని అరెస్టు చేయాలి

వైసిపి నాయకుల ధర్నా

ప్రజాశక్తి-రామచంద్రపురం

జగనన్న కాలనీలో మంగళవారం రాత్రి 70 లారీలు ఇసుక పట్టుకు వెళ్ళిపోవడంపై వైసిపి శ్రేణులు గురువారంమోటార్‌సైకిల్ ర్యాలీ, ధర్నా కార్యక్రమాలు నిర్వహించారు. వెల్ల సావరం గ్రామంలో జగనన్న కాలనీలో నిరుపేదల ఇల్లు కోసం గృహనిర్మాణ శాఖ నిల్వ ఉంచిన ఇసుక నిల్వలను అక్రమంగా తరలించక పోయిన అధికార టిడిపి నాయకులను అరెస్టు చేయాలని వైసిపి ఇంఛార్జ్ పిల్లి సూర్యప్రకాష్ డిమాండ్ చేశారు. వెల్లసావరం వద్ద ఇసుక తరలించిన ప్రాంతంను ఆయన స్వయంగా పరిశీలించి నిరసన కార్య క్రమంలో పాల్గొన్నారు. అధికారులు సూచించిన పేర్లు పై నిందితులను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ధర్నా కార్యక్రమంలో వైసిపి నాయకులు పెట్టా శ్రీనివాస్, ఇంత సంతోషం, కట్టా సూర్యనారాయణ, గాదంశెట్టి శ్రీధర్, అనసూరి సాయిబాబు, ం నియోజకవర్గ వైసిపి కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

### ఇసుక దోపిడీకి పాల్పడింది వైసిపి వారే : టిడిపి

వెల్లసావరం జగనన్న కాలనీ వద్ద ఇసుక దోపిడీకి పాల్పడింది వైసిపి వాళ్లేనని టిడిపి నాయకులు తెలియజేశారు. గురువారం వెల్లసావరం దోపిడీకి గురైన ప్రాంతం వద్ద టిడిపి నాయకులు టేకుమూడి సత్యనారాయణ మాట్లాడుతూ వైసిపి ఇన్చార్జి పిల్లి సూర్య ప్రకాష్ ఆరోపణలు అవాస్తవమన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గరిగిపాటి సూర్యనారాయణ, చింతపల్లి వీరభద్రరావు, కడియాల రాఘవన్, కావాలా నానాజీ తదితరులు పాల్గొన్నారు

## ఎంఎల్‌సి ఎన్నికల విధి విధానాలపై అవగాహన

ప్రజాశక్తి-అంబాజీపేట

తూర్పు, పశ్చిమగోదావరి జిల్లా ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికకు సంబంధించి ఎన్నికల కమిషన్ జారీ చేసిన విధివిధానాలపై అవగాహన పెంచుకోవాలని తహశీల్దార్ జె.వెంకటేశ్వరి అన్నారు. అంబాజీపేట తహశీల్దార్ కార్యాలయంలో గురువారం ఓటర్లుగా ఉపాధ్యాయుల నమోదు కోసం మండల విద్యా శాఖ అధికారులు, ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థల ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలోఎంఇఒలు హైస్కూల్, మండల హైస్కూల్ హెచ్ఎంలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

### రూ.10 లక్షల విలువైన మద్యం ధ్వంసం

ప్రజాశక్తి - ఆలమూరు

ఎస్ఇబి అధికారులు స్వాధీనం చేసుకున్న రూ.10 లక్షల విలువైన మద్యాన్ని గురువారం ధ్వంసం చేశారు. మండల కేంద్రంలోని ఎస్ఇబి కార్యాలయానికి జిల్లా ఎస్ఐబి, అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ జి.అమర్ బాబు గురువారం విచ్చేశారు. పలు అంశాలపై ఆయన మాట్లాడారు. అనంతరం ఆయన సమక్షంలో వివిధ కేసుల్లో పట్టుబడ్డ మద్యాన్ని స్థానిక ఓఎన్జిసి రిగ్ ఖాళీ ప్రాంతంలో ధ్వంసం చేశారు. వివిధ కేసులలో పట్టుబడ్డ 435 లీటర్ల సారాను పారబోశారు. . ఇంచార్జ్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎ.సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

## తహశీల్దార్ల బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలో పలు మండలాల్లో గురువారం తహశీల్దార్లు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయా కార్యాలయాల సిబ్బంది తదితరులు వారికి శుభాకాంక్షలు తెలిపారు. **అయినవిల్లి:** నూతన తహశీల్దారుగా సిహెచ్.నాగ లక్ష్మమ్మ గురువారం బాధ్యతలు బాధ్యతలు చేపట్టారు. ఆమెకు కార్యాలయ సిబ్బంది తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. **మామిడికుదురు :** తహశీల్దార్‌గా మృత్యుంజయరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు విఆర్ఒలు, కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు. **ఆలమూరు:** తహశీల్దార్‌గా కెజె.ప్రకాష్ బాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. మండల విఆర్ఒలు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## అన్నదాన కమిటీ ఏర్పాటు అభినందనీయం

ప్రజాశక్తి-కొత్తపేట

పలివెల ఉమా కొప్పులింగేశ్వర స్వామి ఆలయంలో ప్రతి సోమవారం సాధువులకు, యాత్రికులకు అన్నదానం ఏర్పాటు చేయడానికి అన్నదాన కమిటీ నియమించుకోవడం అభినందనీయమని కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. అన్నదాన కార్యక్రమాన్ని 500 మందితో గురువారం ఆలయంలో ఎంఎల్ఎ చేతుల మీదుగా ప్రారంభింపచేశారు. కార్యక్రమంలో .తోట వెంకటేశ్వరరావు, మాస్టర్ ఆధ్వర్యంలో అన్నదాన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ జీవితం ఆదర్శనీయం

ప్రజాశక్తి-కొత్తపేట

రాజ్యాంగ నిర్మాత, భారతరత్న, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జీవితం ఆలోచనా విధానం నేటి తరానికి ఆదర్శనీయమని అమలాపురం ఎంపి హరీష్ మాథుర్, కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావులు వ్యాఖ్యానించారు. కొత్తపేట పరిధిలోని అంబేద్కర్ కాలనీ లో గురువా అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బూసి జయలక్ష్మి, భాస్కరరావు, పల్లి భీమరావు, కంఠంశెట్టి శ్రీనివాస్, సరేలా రాజబాబు, బహుదూర్, బండారు వీరబాబు, అంబేద్కర్ కాలనీ పెద్దలు మరియు తదితరులు పాల్గొన్నారు.

## గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన

ప్రజాశక్తి-ఆలమూరు

గుడ్ టచ్, బ్యాడ్ టచ్ లపై బాలికలకు అవగాహన తప్పనిసరిగా ఉండాలని రావులపాలెం రూరల్ సిఐ సిహెచ్.విద్యాసాగర్ అన్నారు. స్థానిక బొబ్బా జయశ్రీ గర్ల్స్ హైస్కూల్లో ఆలమూరు ఎస్ఐ ఎం.అశోక్ తో కలసి బాలికలకు వివిధ సైబర్ క్రైమ్ లపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం గురువారం ఆయన నిర్వహించారు.

## బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి

ప్రజాశక్తి-ముమ్మిడివరం

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన ప్రతిఒక్కరూ కృషి చేయాలని జిల్లా సహాయ కార్మిక అధికారి కెబిఆర్.శర్మ (రాజోలు)(ఎఫ్ఎసి)పిలుపునిచ్చారు. చైల్డ్ లేబర్ డ్రైవ్ లో భాగంగా గురువారం ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని పలు షాపులు, హొటల్స్ లలో సహాయ కార్మిక అధికారి బృందం ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. పలువు అధికారులు పాల్గొన్నారు.

## వెంకన్న హుండీ ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

వాడపల్లి వెంకన్న స్వామి వారి హుండీ ఆదాయాన్ని గురువారం ఆలయ ముఖ మండపంలో మందపల్లి దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి పర్యవేక్షణలో45 రోజులకు లెక్కించారు. ఈ లెక్కింపులో రూ.45,93,8,60, 23 గ్రాముల బంగారం, 350 గ్రాముల వెండి సమకూరయని ఆలయ డిసి భూపతి రాజు కిషోర్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకుడు శ్రీనివాస్, మండపేట గ్రూపు దేవాలయాల కార్యనిర్వహణ అధికారి పివిఎస్.కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## వినాయక చవితి ఉత్సవాలకు రాట ముహూర్తం

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

అంగరలో సెప్టెంబర్ 7న ప్రారంభమయ్యే వినాయక చవితి ఉత్సవాలకు గురువారం రాట ముహూర్తం చేశారు. అంగర ఆది గణపతి సెంటర్లో ఆలయ కమిటీ ఛైర్మన్ పెద్దింశెట్టి సూరిబాబు, రాటకు పూజలు నిర్వహించి రాట ముహూర్తం చేశారు. కార్యక్రమంలో మేడేపల్లి కొండ, పెద్దింశెట్టివీరబాబు, పసలపూడి కృష్ణ, కొండిపూడి శ్రీరాములు, ఎర్రం శెట్టి రమణ ,మేక భద్రరావు, యానాల సుబ్బారావు, అచ్చన్న, పడాల రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## సుప్రీం కోర్టు తీర్పుపై నిరసన

ప్రజాశక్తి-రాజోలు

ఎస్‌సి వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును నిరసిస్తూ రాజోలులో మాలల న్యాయపోరాట సమితి, ఎస్‌సి వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు సారథ్యంలో గురువారం ర్యాలీగా రాజోలు తహశీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుని మానవహారం నిర్వహించారు తదుపరి తహశీల్దార్ కార్యాలయంలో మెమోరాండం అందించారు.

## పంచాయతీల రెవెన్యూ తగాదాలపై సమీక్ష

ప్రజాశక్తి-ఆలమూరు

చొప్పెల్ల, చెముడులంక గ్రామాల మధ్య మూడు దశాబ్దాలుగా జరుగుతున్న రెవెన్యూ సరిహద్దుల ఆస్తి పంపకాల తగాదాలపై ఇప్పటికీ కొలిక్కి రాలేదు. చొప్పెల్ల సర్పంచ్ దంగేటి చంద్రకళ బాపణయ్య, చెముడులంక సర్పంచ్ తమ్మన శ్రీనివాసుతో పాటు రెండు గ్రామాల ముఖ్య పెద్దలతో వేర్వేరుగా ఇంచార్జ్ డిఎల్పిఒ ఐదం రాజు గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. రెండు గ్రామాల వారుచెప్పిన విషయాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఆయన తెలిపారు.